

ఓయూ పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేస్తున్న నాయకులు

పసులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలి

కొమ్ము శేఖర్ మాదిగ.. ఓయూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

సికింద్రాబాద్, జనవరి 18: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు మంద కృష్ణ మాదిగపై భౌతికంగా, వ్యక్తిగతంగా రాజ్యాంగ విరుద్ధంగా మాట్లాడిన మాల మహానాడు నాయకుడు పసుల రామ్మూర్తిపై చర్యలు తీసుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఎంఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ మాట్లాడుతూ, మంద కృష్ణ మాదిగపై భౌతిక దాడులు చేసి కొట్టి చంపమని ప్రజలను రెచ్చగొడుతూ సంఘ విద్రోహ శక్తులలాగా మాల మహానాడు నాయకుడు మాట్లాడటం రాజ్యాంగ విరుద్ధమని, ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలిపిన వారిని ఈ దేశం నుంచి బహిష్కరించాలని సుప్రీంకోర్టు న్యాయమూర్తులను, మేధావులను, ప్రజాస్వామ్య వాదులను తప్పుబడుతూ మాట్లాడటంపై చట్టపరమైన కేసులు నమోదు చేసి తక్షణమే అరెస్ట్ చేయాలని పోలీసు అధికారులను కోరారు. కార్యక్రమంలో ఎంఎస్పీ జాతీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు గోవిందు నరేశ్ మాదిగ, రాష్ట్ర ఉపాధ్యక్షులు రామారపు శ్రీనివాస్ మాదిగ, అజిత్ కళ్యాణ్ వాల్మీకి, ఎంఎస్ఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు జన్నాపాల శ్రీనివాస్ మాదిగ, ఓయూ అధ్యక్షులు మంద రాజు మాదిగ, జమ్మిశేడు మహేశ్ మాదిగ, అనిల్ మాదిగ, శ్రీకాంత్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లోనూ..

మాల మహానాడు జాతీయ అధ్యక్షులు పసుల రామ్మూర్తి పై చట్ట పరంగ చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ నాయకులు వారాసిగూడ పోలీస్ స్టేషన్‌లో శనివారం సాయంత్రం ఫిర్యాదు చేశారు. ఎస్సీ వర్గీకరణ జరగడమే సామాజిక న్యాయంగా భావించి మంద కృష్ణ మాదిగ 30 ఏండ్లుగా పోరాటం చేస్తుంటే, పసుల రామ్మూర్తి అనే వ్యక్తి ప్రజలను రెచ్చగొట్టే విధంగా మంద కృష్ణ మాదిగని కించ పరిచే విధంగా అవమానకరంగా మాట్లాడిన మాటలను నాయకులు ఖండించారు. మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి పై చట్టపరంగా చర్యలను తీసుకోవాలని, ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు విజయ మాదిగ, ఎంఎస్పీ హైదరాబాద్ జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ మాదిగలు వారాసిగూడ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో నాయకులు చెరుకూరి సత్య నారాయణ మాదిగ, అక్కనపెల్లి పాండు మాదిగ, కొప్పుల సాయి కుమార్ మాదిగ, మురళీధర్ మాదిగ పాల్గొన్నారు.

ఉపాధే లక్ష్యంగా యువత ముందుకు సాగాలి

స్టూడియోను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జనవరి 18: యువత స్వయం ఉపాధి పొందుతూ మరి కొంత మందికి ఉపాధి అందించే లక్ష్యంగా ముందుకు సాగాలని మంత్రి సీతక్క అన్నారు. బాగ్ లింగంపల్లి(నల్లకుంట) చిన్న నేతృత్వంలో ఏర్పాటు చేసిన డెక్కన్ స్టూడియోస్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మంత్రి సీతక్క, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, ప్రొఫెసర్ కోదండరాంలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మల్యే ముఠాగోపాల్ మాట్లాడుతూ, నేడు యువతకు అనేక అవకాశాలు ఉన్నాయన్నారు. ఉపాధి పొందుతూ మరికొంత మందికి ఉపాధి అందించే లక్ష్యంగా ఈ స్టూడియోను ఏర్పాటు చేయడం అభినందనీయం అని అన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు యాకూబ్, బీఆర్ఎస్ నాయకులు ముచ్చకుర్తి ప్రభాకర్, జనార్దన్, ఆర్.జయదేవ్ సీపీఐ ముషీరాబాద్ కన్వీనర్ వెంకటస్వామి గౌడ్, సీపీఐ(ఎంఎల్) నాయకుడు గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి

- పోస్టర్ ఆవిష్కరణలో సీపీఎం నాయకులు

కవాడిగూడ, జనవరి 18: సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ నాయకులు విజ్ఞప్తి చేశారు. గోల్కొండ చౌరస్తాలోని నగర కార్యాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.శ్రీనివాస్, గ్రేటర్ సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి ఎం.వెంకటేశ్, నగర కమిటీ సభ్యులు ఆర్.వెంకటేశ్, కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.దశరథ్‌లు పాల్గొని రాష్ట్ర మహాసభల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఎం 4వ రాష్ట్ర మహాసభలు ఈ నెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డి పట్టణంలో జరగనున్నాయని చెప్పారు. మహాసభల సందర్భంగా 25న సంగారెడ్డి పట్టణంలో భారీ బహిరంగ సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరవుతున్నారని అన్నారు. మహాసభలలో రాబోయే మూడేండ్ల కాలానికి భవిష్యత్ కార్యాచరణ, కర్తవ్యాలను నిర్ణయిస్తారని తెలిపారు. రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఈ సందర్భంగా వారు విజ్ఞప్తి చేశారు.

మాదిగల పవిత్ర గ్రంథం ఆది పురుషుడు - ఆది ధర్మ

మాదిగల పవిత్ర గ్రంథ ఆవిష్కరణపై చర్చా

చిక్కడపల్లి, జనవరి 18: మాదిగల పవిత్ర గ్రంథం 'ఆది పురుషుడు – ఆది ధర్మ' అని పలువురు వక్తలు పేర్కొన్నారు. సాంస్కృతిక ఆధ్యయన కేంద్రం, శ్రీశ్రీశ్రీ స్వయంభూ ఆది జాంబవ మఠం ట్రస్టు ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ప్రొఫెసర్ ఏకు తిరుపతి రచించిన 'ఆది పురుషుడు – ఆది ధర్మం' మాదిగల పవిత్ర గ్రంథ ఆవిష్కరణపై చర్చా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ప్రొఫెసర్ ఏకు తిరుపతి, ఎంఆర్పీఎస్ అధ్యక్షుడు కృపాకర్, మేరి మాదిగ, ఈటక రాజు తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రంథానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను వారు ఆవిష్కరించారు. అనంతరం, ప్రొఫెసర్ గాలి వినోదక్ కుమార్, ప్రొఫెసర్ ఏకు తిరుపతిలు మాట్లాడుతూ, సృష్టికి మూల కారుడు జాంబవంతుడని అన్నారు. పెద్ద కులం మాదిగ కులం అని పేర్కొన్నారు. మాదిగలు ఆదిలోనే ఈ దేశాన్ని ఏలారని, తిరిగి ఈ దేశాన్ని ఏలాలంటే ఐక్యంగా ముందుకు సాగాల్సిన అవసరం ఉందని చెప్పారు. మాదిగల పవిత్ర గ్రంథం ఆది పురుషుడు ఆది ధర్మం యొక్క విశిష్టత గురించి మాట్లాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. విశ్వంలో జాంబవంతుని పాత్ర, మానవ సమాజాల నిర్మాణానికి, యుగాలలో జాంబవంతుని వంశం ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. త్వరలోనే గ్రంథం ఆవిష్కరిస్తున్నట్లు ప్రొఫెసర్ ఏకు తిరుపతి తెలిపారు.

వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, ప్రొఫెసర్ తిరుపతి

అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి

▸▸ సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

▸▸ కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులు షురూ



బోయిగూడలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

బన్సీలాల్‌పేట్, జనవరి 18: ప్రజల అవసరాలకు అనుగుణంగానే అభివృద్ధి పనులను చేపడుతున్నామని మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. పద్మారావునగర్‌లోని వెంకటాపురం కాలనీలో రూ.40 లక్షలతో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాలు నిర్మాణ పనులను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంకటాపురం కాలనీలో తమ హయాంలోనే రోడ్లను, పార్కును అభివృద్ధి చేయడం జరిగిందని గుర్తు చేశారు. శిథిలావస్థకు చేరిన కమ్యూనిటీ హాలు స్థానంలో నిర్మించే నూతన హాలును కాలనీ వాసులు తమ అవసరాల కోసం సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాలనీ అధ్యక్షుడు వజీర్ మోహన్, సకినాల రాజు, చక్రధర్ యాదవ్, సుధాకర్, వెంకటరమణ, పద్మిని, ఆశా, విజయలక్ష్మి, గజలక్ష్మిలు ఎమ్మెల్యే తలసానికి సన్మానం చేసి, ధన్యవాదములు తెలిపారు.

రూ.20 లక్షలతో డైనేజీ పనులు షురూ..

అంతర్గత మార్గాలలో కూడా ఎక్కువ కాలం మన్నేలా సిమెంట్ రోడ్లను ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆయన ఉప్పలమ్మ దేవాలయం సమీపంలోని గల్లీలలో అధికారులతో కలిసి శనివారం పర్యటించారు. పలువురు స్థానికులతో మాట్లాడి స్థానికంగా నెలకొన్న సమస్యలను తెలుసుకున్నారు. మురుగునీరు నిలవకుండా చర్యలను తీసుకోవాలని, ప్యాచ్ వర్క్‌లను చేపట్టకపోవడం వలన ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, నూతన రోడ్ల కోసం ప్రతిపాదనలు రూపొందించాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం, రూ.20 లక్షల వ్యయంతో కట్టెల మండి మార్గంలో చేపట్టనున్న నూతన డైనేజీ పైపులైన్ పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బన్సీలాల్‌పేట్ కార్పొరేటర్ కే.హేమలత, జీహెచ్ఎంసీ ఉప కమిషనర్ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, డీఈఈ ఆంజనేయులు, టౌన్ ప్లానింగ్ ఏసీపీ సుశ్మిత, జల మండలి జీఎం వినోద్ కుమార్, డీజీఎం ఆశిష్, లస్కర్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు జి.పవన్ కుమార్ గౌడ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు వెంకటేశన్ రాజు, నాయకులు కె.లక్ష్మీపతి, ఏసూరి మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వస్త్ర దుకాణాల్లో చోరీ

కార్ఖానాలో బంగారం, వెండి, నగదు అపహరణ

30 తులాల వెండి, 9 గ్రాముల బంగారం తస్కరణ

తిరుమలగిరి వస్త్ర దుకాణాల్లో రూ.94 వేల నగదు..

బొల్లారం,జనవరి 18: తిరుమలగిరి, కార్ఖానాలోని వస్త్ర, బంగారం దుకాణాలలో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు చోరీకి పాల్పడిన ఘటన తిరుమలగిరి, కార్ఖానా పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన ప్రకారం, మొదట అర్ధరాత్రి 2 గంటల 15 నిమిషాల సమయంలో ముగ్గురు ఆగంతకులు మాస్కులు ధరించి కార్ఖానాలోని విక్రమ్‌పురి కాలనీలోని గీవ బంగారు దుకాణంలో షెట్టర్ తాళాలు పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. దుకాణంలో ఉన్న 30 తులాల వెండి, 9 గ్రాముల బంగారం నగలు చోరీ చేశారు. అనంతరం, అదే మార్గంలో తిరుమలగిరి ప్రధాన రహదారిలో ఉన్న 13 బట్టల దుకాణాల షట్టర్లను పగులగొట్టి వాటిల్లో ఉన్న రూ.94 వేల నగదును అపహరించారు. దుకాణాల నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కార్ఖానా, తిరుమలగిరి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు. రాజీవ్ రహదారి జేబీఎస్ నుంచి కరీంనగర్ ప్రధాన రహదారికి ఇరువైపులా దుకాణ సముదాయాలు ఉండటం, వీటికి రెండు పోలీస్ స్టేషన్ల కూతవేటు దూరంలో ఉండటం గమనార్హం.

కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలి

అసోసియేషన్ నూతన అధ్యక్షులు

ఎస్.ఎల్. పద్మ, ప్రధాన కార్యదర్శి సుధాకర్

కవాడిగూడ, జనవరి 18: కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని కొత్తగా ఎన్నికైన ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షులు ఎస్.ఎల్. పద్మ, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌లు డిమాండ్ చేశారు. ప్రగతిశీల కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్– టీయూసీఐ రాష్ట్ర జనరల్ బాడీ సమావేశం శనివారం హైదరాబాద్‌లోని విద్యానగర్ మార్క్స్ భవన్‌లో జరిగింది. ఈ సమావేశంలో జనరల్ బాడీ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకుంది. రాష్ట్ర అధ్యక్షులుగా ఎస్.ఎల్. పద్మ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఎం.సుధాకర్‌లు ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా పి.అరుణ్ కుమార్, ఈశ్వరి, మౌనిక, పుష్పలత, శశికళ, సహాయ కార్యదర్శులుగా అరుణ, వీరమణి, ప్రేమలత, షాహిదా, బుజ్జమ్మ, కోశాధికారిగా లక్ష్మి ఎన్నికయ్యారు. అన్ని జిల్లాలకు ప్రాతినిధ్యం కల్పిస్తూ రాష్ట్ర కమిటీ సభ్యులుగా సుమలత, సునీత, అశోక్, అనసూర్య, మధుర, సైదమ్మ, కాంతమ్మ, రమేశ్, శారద, వినోద, భద్రమ్మ, రేణుక, రాజేశ్వరి, రమాదేవి, అరుణ, రమ, చంద్రకళ, అలివేలు, ఎల్లమ్మ, అచ్చాలి, జములతో పాటు ఐదుగురు కో ఆప్షన్ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ నూతన కార్యవర్గం పలు తీర్మానాలు చేసింది. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన అధ్యక్షులు ఎస్.ఎల్. పద్మ, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌లు మాట్లాడుతూ కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్లకు కనీస వేతనాలు అమలు చేయాలని,వ వారికి బేసిక్ పే నిర్ణయించాలన్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. పని భారాన్ని తగ్గించి వీక్లీ ఆఫ్‌ను అమలు చేయాలని కోరారు. మరణించిన వారికి ఎక్స్‌గ్రేషియా, పదవీ విరమణ చేసిన వారికి రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీలను భర్తీ చేయాలని, కేజీబీవీ సర్వీసుకు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఖాళీలను భర్తీ చేయాలన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్, ముఠా జయసింహా, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజ్ కుమార్, సంఘం అధ్యక్షుడు సంజీవ్ కుమార్ తదితరులు

పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలి

▸▸ ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, జనవరి 18: పద్మశాలీలు అన్ని రంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. పద్మశాలి ప్రజా సంఘం, ముషీరాబాద్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. స్వాతంత్ర్య సమరయోధుడు, తెలంగాణ ఉద్యమకారుడు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహం వద్ద అశోక్‌నగర్‌లోని ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందుకు ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్, పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వల్లకాటి రాజ్ కుమార్, బీఆర్ఎస్ యువ నాయకుడు ముఠా జయసింహా, కాంగ్రెస్ నాయకురాలు గుర్రం చంద్రకళా శంకర్‌లతో కలిసి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేనేత కార్మికుల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తు చేశారు. పద్మశాలీలు సంఘటితమై అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. కార్యక్రమంలో పద్మశాలి ప్రజా సంఘం అధ్యక్షుడు తలకొక్కుల సంజీవ్ కుమార్, బింగి, నవీన్ కుమార్, పున్న సత్య నారాయణ, ఎయిర్‌టెల్ రాజు, బల్ల ప్రశాంత్, అమర్ కుమార్, బొట్టు శ్రీనివాస్, దుర్గా ప్రసాద్, జంట్యాల ప్రభాకర్, వంశీ, బీఆర్ఎస్ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్ కుమార్, మీడియా ఇన్‌చార్జి ముచ్చకుర్తి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ఈస్ట్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్

నిబంధనలు పాటించకనే.. ప్రమాదాలు

- ఈస్ట్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్

అడ్డగుట్ట, జనవరి 18: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటించకపోవడం వల్లనే తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయని ఈస్ట్, సెంట్రల్ జోన్ ట్రాఫిక్ డీసీపీ అశోక్ కుమార్ అన్నారు. మెట్టుగూడ ఆలుగడ్డ బావి వద్ద రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా వాహనదారులకు ఫ్రీ లెఫ్ట్‌పై శనివారం ఆయన అవగాహనను కల్పించారు. ఈ సందర్భంగా డీసీపీ అశోక్ కుమార్ మాట్లాడుతూ, ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులు తప్పనిసరిగా అవగాహనను పెంచుకోవాలని ఆయన సూచించారు. హెల్మెట్ ధరించి వాహనాలను నడపాలని, ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని ఆయన తెలిపారు. అంతే కాకుండా ఫ్రీ లెఫ్ట్ ద్వారా వెళ్లేవారికి ఇతర వాహనదారులు అసౌకర్యాన్ని కలిగించరాదని, అలా ఫ్రీ లెఫ్ట్ వాహనాలకు అడ్డుగా వాహనాలను నిలిపితే రూ.1000 జరిమానాను విధించడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, చిలకలగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు విరుద్ధమైతే.. కేసులు తప్పవు

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే కేసులు తప్పవని మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉపా శంకర్ అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా శనివారం మహంకాళి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో బోయిగూడ, రాణిగంజ్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి నిబంధనలు పాటించని వాహనదారులకు చలానాలు విధించారు. అలాగే, కేసులు నమోదు చేశారు. ఇందులో డ్రైవింగ్ లైసెన్స్ లేని వారిని గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని దీంతో పాటు డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని చెప్పారు. ట్రాఫిక్ నిబంధనలు ప్రతి వాహనదారుడు పాటించాలని సూచించారు. కార్యక్రమంలోమహంకాళి ట్రాఫిక్ ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. *– బేగంపేట్ జనవరి 18*

పిల్లల ఫిర్యాదులు, సమస్యలను పరిష్కరించాలి

నగర డిప్యూటీ మేయర్ శ్రీలతా రెడ్డి

సికింద్రాబాద్, జనవరి 18: పిల్లల ఫిర్యాదులను శ్రద్ధగా పరిశీలించి, సంబంధిత సమస్యల పరిష్కారానికి తక్షణం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు నగర డిప్యూటీ మేయర్ శ్రీలతా రెడ్డి సూచించారు. తార్నాక డివిజన్ పరిధిలోని వినోభానగర్‌లో ఆప్స్ ఫౌండేషన్ శనివారం నిర్వహించిన ఇంద్ర ధనుస్సు బాలల సంగం చైల్డ్ ఫ్రెండ్లీ వార్డ్ కార్యక్రమంలో నగర డిప్యూటీ మేయర్ (శ్రీలతారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా, వినోభా నగర్ బస్తీ పిల్లలు తమ ప్రాంతంలోని పలు సమస్యలను డిప్యూటీ మేయర్, సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, పిల్లలను రాజకీయ, సామాజిక బాధ్యతల పట్ల జాగరూకులుగా తీర్చిదిద్దడం ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యంగా పేర్కొన్నారు. ఇందులో భాగంగా, పిల్లల హక్కులు, పౌర సమానత్వం, ఆర్థిక స్వావలంబన, విద్య , ఆరోగ్యం వంటి అంశాలపై చర్చించారు. పిల్లల అభిప్రాయాలను బలంగా ప్రోత్సహిస్తూ, వారి ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి కార్యక్రమాలు మైలురాయిగా నిలుస్తాయని డిప్యూటీ మేయర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, ఆప్స్ ప్రతినిధులు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

ఓయూ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొ. నాగేశ్వర్

సికింద్రాబాద్, జనవరి 18: 108 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర కలిగిన ఉస్మానియా విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల నూతన వైస్ ప్రిన్సిపాల్‌గా ఆంగ్ల విభాగ ఆచార్యులు ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్‌ను నియమిస్తూ ఉస్మానియా యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ఎం.కుమార్ నియామక పత్రాన్ని అందజేశారు. ఇప్పటికే కొండా నాగేశ్వర్ పలు అడ్మినిస్ట్రేటివ్ పదవులను విజయవంతంగా నిర్వహించారని, విద్యార్థి, అధ్యాపక వర్గాల్లో సత్సంబంధాలు కలిగిన నాగేశ్వర్ నియామకం పట్ల పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు. జనవరి 20 సోమవారం ఉదయం 10:30 గంటలకు వైస్ ప్రిన్సిపాల్‌గా తను పదవీ బాధ్యతలు స్వీకరించనున్నట్టు డాక్టర్ కొండా తెలిపారు.

అంతర్జాతీయ సాహిత్య సదస్సులో

డా. యడవెల్లి పత్ర సమర్పణ

మాట్లాడుతున్న డాక్టర్ యడవెల్లి సైదులు

సికింద్రాబాద్, జనవరి 18: అంతర్జాతీయ సాహిత్య సదస్సులో డాక్టర్ యడవెల్లి సైదులు పత్ర సమర్పణ చేశారు. అసఫ్‌జాహీ రాజవంశం 300 ఏండ్ల వార సత్వంపై 3 రోజులుగా వీరనారి చాకలి ఐలమ్మ విశ్వవిద్యాలయంలో 'భారతదేశ సమకాలీన నాగరికతకు ఉర్దూ భాష సాహిత్యాన్ని ప్రోత్సహించడంలో 'ముస్లిమేతర కవులు, రచయితల పాత్ర' అనే అంశంపై జరుగుతున్న అంతర్జాతీయ సాహిత్య సదస్సులో సీతాఫల్‌మండి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న డా. యడవెల్లి సైదులు పాల్గొని పత్ర సమర్పణ చేశారు. సైదులు 'దాశరథి కృష్ణమాచార్యుల కవిత్వంలో ఉర్దూ సాహిత్య పరిచయం' అనే అంశంపై ప్రసంగించారు. ఉర్దూ సాహిత్య సౌందర్యాన్ని గజల్, రుబాయిల ద్వారా తెలుగు సాహితీ లోకానికి పరిచయం చేసిన గొప్ప కవి దాశరథి అని పేర్కొన్నారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన కోఠి మహిళా విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ సూర్య ధనుంజయ్, ప్రత్యేక అతిథి అసఫ్‌జాహీ కుటుంబానికి చెందిన రౌనక్ యార్ ఖాన్, విశిష్ట అతిథిగా విచ్చేసిన టీజేపీఎస్టీ చైర్మన్ డాక్టర్ బుర్రా వెంకటేశం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల సీతాఫల్‌మండి ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రం తెలుగు సాహిత్యంలో విశేషాంశాలపై పరిశోధనలు, పత్ర సమర్పణలు చేస్తున్న యడవెల్లి సైదులను అభినందించారు.

కేపీ నర్సింగ సేవలు చిరస్మరణీయం

చిక్కడపల్లి, జనవరి 18: అత్యంత వెనుకబడిన మాదిగలకు బంధు సేవా మండలి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడు కేపీ నర్సింగ రావు చేసిన సేవలు చిరస్మరణీయం అని పలువురు వక్తలు అన్నారు. అరుంధతీయ బంధు సేవా మండలి ఆధ్వర్యంలో శనివారం బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేపీ నర్సింగ రావు సంతాప సభ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ కేంద్రం మంత్రి సర్వే సత్యనారాయణ, రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి అప్పిగట్ల భరత్ భూషణ్, బంధు సొసైటీ అధ్యక్షుడు వీర స్వామి తదితరులు హాజరై నర్సింగ రావు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో బంధు సేవా మండలి సభ్యులు కృష్ణ, పవన్ కుమార్, పల్లెల వీరస్వామి, రాజలింగం పాల్గొన్నారు.

త్యాగరాజస్వామి ఆరాధనోత్సవాలు ప్రారంభం

కవాడిగూడ, జనవరి 18: త్యాగరాయ గానసభ ఆధ్వర్యంలో విఖ్యాత వాగ్గేయకారుడు శ్రీత్యాగరాజస్వామి 178వ ఆరాధనోత్సవాలు శనివారం ఉదయం గానసభ ప్రాంగణంలో పంచరత్న కీర్తనల గోష్ఠిగానంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ వీణా వాద్య నిపుణురాలు ఆనంద రాజ్యలక్ష్మి తమ వీణ వాదనతో 'ఎందరో మహానుభావులు, తెర తీయగరాదా, నిధి సుఖమా రాముని సన్నిధి చాలా సుఖమా' తదితర త్యాగరాజ కీర్తనలు వినిపించారు. కార్యక్రమంలో పాల్గొన్న జీఎస్‌టీ విశ్రాంత అధికారి ఎం.శ్రీనివాస్ శాలువా, జ్ఞాపికతో ఆనంద రాజ్యలక్ష్మిని ఘనంగా సత్కరించారు.

రైలు కింద గుర్తు తెలియని వ్యక్తి పడి ఆత్మహత్య

మారేడ్‌పల్లి, జనవరి 18: రైలు కింద గుర్తు తెలియని వ్యక్తి పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది